
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్నూలు
జిల్లా వార్తలు
సోమవారం 22 ఏప్రిల్ 2024



నేడు పది ఫలితాలు విడుదల

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 21: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదలవుతాయని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. పది పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జరిగాయి. ఏప్రిల్ 1 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం జరిగింది. రికార్డు స్థాయిలో 22 రోజుల్లోనే టెన్త్ ఫలితాలు విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ కసరత్తు పూర్తి చేసింది. కర్నూలు జిల్లాలో 489 ఉన్నత పాఠశాలల నుంచి 37,801 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫలితాలు విడుదల కానుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఉత్కంఠ నెలకొంది.



తుంగభద్ర నదీ ప్రాంతంలో గుండ్రేవుల నిర్మాణానికి ప్రతిపాదించింది ఇక్కడే..

జగన్..!
గుండ్రేవుల గుర్తుందా..?

2017 నవంబరులో ఆనాటి ప్రతిపక్ష నేత జగన్ ప్రజా సంకల్ప పాదయాత్ర చేశారు. అందులో భాగంగా కర్నూలు జిల్లాకు వచ్చినప్పుడు రాయలసీమ సాగునీటి సమితి ఆధ్వర్యంలో రైతులు తుంగభద్ర నదిపై గుండ్రేవుల జలాశయం నిర్మించాలని ఆయనను కోరారు. ఈ జలాశయం నిర్మిస్తే కేసీ ఆయకట్టు రైతులకు, పశ్చిమ ప్రాంత రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. దానికి జగన్ స్పందిస్తూ తను ప్రభుత్వం రాగానే గుండ్రేవుల ప్రాజెక్టు పనులు చేపడతానని హామీ ఇచ్చారు. ఏడాదిన్నరకు జగన్ సీఎం అయ్యారు. మాట తప్పను, మడమ తిప్పను అన్న నాయకుడు కదా.. ఇక తప్పక గుండ్రేవుల సాకారం అవుతుందని రైతులు ఆనందించారు. మోసకారి మాటలతో అధికారమే పరమావధిగా వచ్చిన జగన్ జనానికి ఇచ్చిన హామీ మర్చిపోయారు. ఉమ్మడి జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు, 14 మంది ఎమ్మెల్యే స్థానాలను వైసీపీకి ఇచ్చినా జగన్ తన ఐదేళ్ల పాలనలో గుండ్రేవుల ప్రాజెక్టు ఊసే ఎత్తలేదు. పైగా అంతర్రాష్ట్ర సమస్య అంటూ కొర్రీ పెట్టి ఆ ఫైలు ఈఎన్‌సీ ఆఫీసులో పక్కన పడేశారు. జగన్ చిత్తశుద్ధి ఇదేనా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మాట మరిచిన జగన్

పాదయాత్ర సమయంలో కర్నూలు, కోడుమూరుల్లో జగన్ మాట్లాడుతూ తన ప్రభుత్వం రాగానే గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. సీఎంగా బాధ్యతలు చేపట్టాక ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో గుండ్రేవుల జలాశయం కూడా చేర్చి పనులు చేపడుతామని అన్నారు. పైగా తెలంగాణలో కూడా జగన్ అనుకూల కేసీఆర్ ప్రభుత్వం ఉండడంతో ప్రాజెక్టుకు పునాది రాయి పడుతుందని భావించారు. అయితే.. హామీ ఇచ్చిన జగన్ ఏనాడో మరిచిపోయారు. ప్రాజెక్టు సమీక్షల్లో ఈ ప్రాజెక్టు ప్రస్తావన కూడా లేదు. ఎలాగైనా అధికారంలోకి రావలనే దురాలోచనతో ఓట్ల కోసం గుండ్రేవుల ప్రాజెక్టు హామీ ఇచ్చి తమను వంచించారని కరువు సీమ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే కర్నూలు నగరం తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించవచ్చు.. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు గ్రావిటీ ద్వారా నీరు అందివ్వచ్చు. తాజాగా అంచనా వ్యయం రూ.5,500 నుంచి రూ.6 వేల కోట్లకు చేరిందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

- తుంగభద్రపై 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం
- కందనవోలు రైతుల స్వప్నం
- చంద్రబాబు ప్రభుత్వంలో రూ.2,890 కోట్లు మంజూరు
- పాదయాత్రలో ప్రతిపక్ష నేతగా హామీ
- ఐదేళ్లలో ఆ ఊసే ఎత్తని సీఎం జగన్
- ఎమ్మెల్యేలో లోపించిన చిత్తశుద్ధి

జగన్ ఓట్లాటలో రైతులకు అన్యాయం

జగన్ అధికారంలోకి వచ్చాక ఈ ఐదేళ్లలో ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు. పునాది రాయి వేయలేదు. ఈ ప్రాజెక్టు వల్ల అంతర్రాష్ట్ర జల వివాదం తలెత్తుతుందని విజయవాడలో జలవనరుల శాఖ ఈఎన్‌సీ ఆఫీసులో గుండ్రేవుల ఫైల్‌ను మూలన పడేశారు. ఇంతకంటే దుర్మార్గం మరొకటి ఉంటుందా..? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే వైసీపీ నాయకులకు గుణపాఠం చెబుతామని కేసీ కెనాల్ ఆయకట్టు రైతులు సహా కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం రైతులు అంటున్నారు.



2019 మార్చి 2న గుండ్రేవులకు శిలాఫలకం వేసిన ఆనాటి సీఎం చంద్రబాబు. చిత్రంలో నాటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి



కర్నూలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుంకేసుల జలాశయం ఎగువన తుంగభద్ర నదిపై సి. బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామం సమీపంలో గుండ్రేవుల జలాశయం నిర్మించి కేసీ ఆయకట్టు సహా పశ్చిమ ప్రాంతం రైతులకు సాగు, తాగునీరు ఇవ్వాలని రైతుల ప్రధాన డిమాండ్ ఇది. ఈ ప్రాజెక్టు కోసం గత టీడీపీ ప్రభుత్వంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి నాయకత్వంలో రైతులు పాదయాత్ర కూడా చేశారు. కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో కేసీ కాలువ ఆయకట్టు 2.65,628 ఎకరాల ఉంది. కేడబ్ల్యూడీటీ-1 అవార్డు ప్రకారం తుంగభద్ర నది నుంచి కేసీ కాలువకు 39.90 టీఎంసీలు నీటి వాటా ఉంటే.. 8 టీఎంసీలు ఎస్ఆర్‌బీసీ కాల్వకు కేటాయించారు. మిగిలిన 31.90 టీఎంసీలు కర్నూలు మండలం సుంకేసుల సమీపంలో సుంకేసులు బ్యారేజీ కేసీ కాలువకు మళ్లించాలి. బ్యారేజీ సామర్థ్యం 1.20 టీఎంసీలే. కేసీ వాటలో తుంగభద్ర డ్యాం నుంచి 10 టీఎంసీలు, తుంగభద్ర నదీ ప్రవాహం ద్వారా 21.90 టీఎంసీలు తీసుకోవాలి. తుంగభద్రకు ఏటేటా వరద రోజులు తగ్గిపోతున్నాయి. చివరి ఆయకట్టుకు సాగునీరు అదని దైన్యం. పెట్టుబడి, దిగుబడి రూపాల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతుల కష్టాలు తీరాలంటే సుంకేసుల బ్యారేజీకి ఎగువన 20 టీఎంసీలు సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మిస్తే కేసీ ఆయకట్టుతో పాటు కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాలలో గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాలు కరువు నేలకు సాగు, తాగునీరు ఇవ్వచ్చని రిటైర్డ్ ఇంజనీరింగ్ నిపుణుడు సుబ్బరాయుడు ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సర్వే కోసం రూ.63 లక్షలు నిధులు ఇచ్చారు. ఆర్వీ అసోసియేట్స్ సంస్థ సర్వే, డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) ప్రభుత్వానికి ఇచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం రూ.2,890 కోట్లు మంజూరు చేస్తూ 2019 మార్చి 2న జీవో ఆర్‌టీ నంబరు-153 జారీ చేశారు. టెండర్లు పిలవాలనుకునే సమయానికి ఎన్నికల షెడ్యూల్ రావడంతో వాయిదా పడింది.

ఇదేనా మీ చిత్తశుద్ధి



గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తే కరువు ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. గత సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లు మంజూరు చేశారు. ప్రతిపక్ష నేతగా జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఐదేళ్లనా ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదు. పైగా అంతర్రాష్ట్ర వివాదం అంటూ పక్కన పెట్టడం బాధగా ఉంది. ఇదేనా జగన్‌కు రైతులపై ఉండే చిత్తశుద్ధి? ఓట్ల కోసం రైతులను బలి చేస్తారా..?

- ఎ.గోపాల్‌రెడ్డి, కోడుమూరు సబ్ ఎల్లెల్సీ సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, కె.నాగులాపురం, గూడూరు మండలం

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోండి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. సృజన



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 21: పోస్టల్ బ్యాలెట్ కోసం పీవో, ఏపీవోలు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ఆదివారం పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై రిటర్నింగ్ అధికారులు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారులు, తహసీల్దార్లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నూతనంగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఇతర జిల్లాల్లో ఓటు ఉన్న వారి దరఖాస్తులను ఈ నెల 28వ తేదీలోపు పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి ద్వారా సేకరించి విజయవాడకు పంపిస్తామన్నారు. మే 3వ తేదీలోపు ఈవీఎంల కమిషనింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు. 8వ తేదీ నాటికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా అత్యవసర సర్వీసుల్లో ఉన్న వారు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఓటరుకు ఎస్ఎంఎస్ ద్వారా వివరాలు తెలియస్తామన్నారు. ఇంకా ఎవరైనా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేయకపోతే ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, పత్తికొండ ఆర్డీవో రామలక్ష్మి, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, ఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లగా ప్రమాదం



మృతి చెందిన విద్యార్థి గొల్ల హరి

గోనెగండ్ల, ఏప్రిల్ 21: పంట పొలానికి నీరు పెట్టడానికి వెళ్లిన గొల్ల హరి(14) అనే విద్యార్థి ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన గోనెగండ్ల మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సోమన్న, భాగ్యలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు హరి గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. సోమన్నకు గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని హంద్రీ నది పక్కన ఎకరా పొలం ఉంది. అందులో వేరుశనగ పంట సాగు చేశాడు. పొలానికి నీరు పెట్టేందుకు సోమన్న బయలుదేరుతుండగా.. కుమారుడు హరి ఆదివారం సెలవు కాబట్టి తాను వెళ్లి పంటకు నీరు పెట్టి వస్తానని బయల్దేరాడు. హరి పొలం దగ్గర విద్యుత్ బోర్డులోని ఫీజులను సరి చేస్తుండగా ఫీజ్ క్యారియర్ కింద ఉన్న తెగిపోయిన విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు ఎంత సేపటికి ఇంటి రాకపోవడంతో తండ్రి సోమన్నకు అనుమానం వచ్చి పొలానికి వెళ్లి మృతి చెందిన కుమారుడ్ని చూసి విలపించాడు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణాలను పరిశీలించారు.

నేడు శ్రీశైలానికి చంద్రబాబు



శ్రీశైలం, ఏప్రిల్ 21: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల దర్శనార్థం సోమవారం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు శ్రీశైలానికి రానున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా సుండిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సాక్షి గణపతి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకుని శ్రీశైలంలోని భ్రమరాంబ సదన్ అతిథి గృహానికి చేరుకుంటారు. తరువాత క్షేత్రపరిధిలోని బయలు వీరభద్రస్వామిని దర్శించుకుంటారు. తర్వాత భ్రమరాంబికా మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు జరిగే ప్రత్యేక పూజల్లో చంద్రబాబు పాల్గొంటారు.

కర్నూలుకు మంచినీరు ఇచ్చారా?

- పదేళ్లలో నగరంపై నిర్లక్ష్యం
- రోడ్ షోలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల



మాట్లాడుతున్న షర్మిల

కర్నూలు (అర్బన్), ఏప్రిల్ 21: వైసీపీ ప్రభుత్వం కర్నూలుకు మంచినీరు కూడా ఇవ్వలేదని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. ఆదివారం కర్నూలు నగరంలో ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ న్యాయ యాత్ర పేరుతో రోడ్ షో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న షర్మిల పాతబస్తీ చౌక్ బజార్‌లో మాట్లాడుతూ కర్నూలు నగరానికి మంచినీరు ఇచ్చేలా ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించలేదని అన్నారు. ఈ ప్రభుత్వం కనీసం మంచి నీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. కర్నూలును న్యాయం రాజధాని చేస్తామని చెప్పి ఇప్పటికి ఒక్క ఇటుక పెళ్ల కూడా వేయకుండా మోసం చేశారని అన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు కడితే రెండు లక్షల ఎకరాలకు సాగునీరు వచ్చేదని, కర్నూలులో 6 లక్షల మంది ప్రజలకు తాగునీరు కూడా అందేదని తెలిపారు. సీఎం జగన్ గుండ్రేవుల ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. గత పదేళ్లలో కర్నూలు నగర అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పిన జగన్ ఇప్పటికి ఒక్క క్యాలెండర్ కూడా ఇవ్వలేదని అన్నారు. 2.25 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని మోసం చేశారని అన్నారు. కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా సాధ్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కే. బాబురావు, కర్నూలు ఎంపీ అభ్యర్థి రాంపుల్లయ్య యాదవ్, నరసింహులు యాదవ్, అనంతరత్నం, వెంకటరెడ్డి, జాన్ విల్సన్, ప్రమీలమ్మ, లాజరస్, ఏ. వెంకట సుజాత, రియాజుద్దీన్, ఖాజాహుసేన్ తదితరులు పాల్గొన్నారు.



షర్మిల రోడ్‌షోకు హాజరైన జనం



బీ ఫారాలు తీసుకున్న తరువాత టీడీపీ అధినేత చంద్రబాబుతో కర్నూలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అభ్యర్థులు

పోల్ మేనేజ్‌మెంట్ కీలకం

- బూత్ స్థాయి నుంచి బలోపేతం చేసుకోవాలి
- అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేసిన చంద్రబాబు

కర్నూలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కురుక్షేత్రంలో విజయం మనదే.. సర్వేల న్నీ కూడా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం తథ్యమని చెబుతున్నాయి. ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్ చాలా కీలకమని, బూత్ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని టీడీపీ అభ్యర్థులకు అధినేత నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. ఆదివారం ఉండవల్లిలో తన స్వగృహంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు బీ-ఫారాలు అందజేశారు. బీ-ఫారాలు అందుకున్న వారిలో కర్నూలు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే అభ్యర్థులు టీజీ భరత్, బీవీ జయనాగేశ్వరరెడ్డి, బొగ్గుల దస్తగిరి, మాధవరం రాఘవేంద్రరెడ్డి, కేఈ శ్యాంబాబు, బి.వీరభద్రగౌడ్, గౌరు చరిత ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మిగిలిన సమయం 23 రోజులే ఉందని, నిర్లక్ష్యాన్ని వీడాలని అన్నారు. అప్రమత్తంగా రాజకీయ వ్యూహాలతో ముందుకు వెళ్లాలని, లోపాలు ఉంటే సరిదిద్దుకుని విజయం సాధించాలన్నారు. ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీకి రావాలని ఆకాక్షించారు. నియోజకవర్గాల వారిగా తాజా పరిస్థితులు వివరించి ఎలా ముందుకు వెళ్లాలో దిశానిర్దేశం చేశారు. రోజుకు 18 గంటలు పని చేయాలన్నారు. కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. పార్టీలో ఎవరైనా అసంతృప్తితో ఉంటే వారిని బుజ్జగించి కలుపుకు పోవాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

నిబంధనలు ఏమయ్యాయి?

- ఉరుకుంద ఆలయ కాంట్రాక్టు ఉద్యోగి భార్యకు టెండర్లు
- వైసీపీ నాయకుల అండదండలు
- పట్టించుకోని ఆలయ అధికారులు

కోసిగి/కౌతాళం, ఏప్రిల్ 21: ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి దేవస్థానంలో కాంట్రాక్టు ఉద్యోగి తన భార్య పేరున రెండు టెండర్లు తీసుకోవడం విమర్శలకు దారి తీసింది. ఇదంతా అధికారులకు తెలియకుండానే జరిగిందా? అనే అనుమానం వస్తోంది. అధికార వైసీపీ నాయకులకు సన్నిహితుడు కావడం వల్లే సదరు ఉద్యోగి ఈ పని చేయగలిగాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 19న శుక్రవారం ఉదయం 11 గంటలకు దేవస్థానానికి వివిధ టెండర్లు నిర్వహించారు. ఇందులో కాంట్రాక్టు ఉద్యోగి పి. లక్ష్మీనాథ్‌రెడ్డి తన భార్య పి.లక్ష్మికి వంట చెరకు సప్లయ్ చేయడానికి టింబర్ డిపో లేకపోయినా ఆ టెండరు దక్కించుకున్నాడు. అలాగే వీఐపీలు ఆలయానికి వచ్చినప్పుడు శేషవస్త్రాలు, పట్టువస్త్రాలు, కింది స్థాయి ఉద్యోగులకు శ్రావణమాస ఉత్సవాలలో చీరెలు, తెల్లపంచ, అంగీ, కార్మికులకు కాకీ డ్రస్సులు ప్రతి ఏటా ఇస్తారు. ఈ క్లాతింగ్ మెటీరియల్ టెండర్‌ను కూడా కాంట్రాక్టు ఉద్యోగి లక్ష్మీనాథ్ రెడ్డి తన భార్య పేరు కైవసం చేసుకున్నాడు. ఆలయంలో పని చేసే ఉద్యోగులు, వారి బంధువులు వేలం పాటలో పాల్గొనరాదన్న నిబంధనలు ఉన్నాయి. అయినా ఈవో దగ్గర అటెండరుగా పని చేస్తుండటం, అధికార పార్టీ నాయకులతో మంచి సంబంధాలు ఉండటంతో టెండర్లను భార్య పేరు మీద ఆ ఉద్యోగి దక్కించుకున్నాడనే విమర్శలు ఉన్నాయి. వంట చెరకు సప్లయ్ చేయడానికి టింబర్ డిపో ఉండాలి. క్లాతింగ్ మెటీరియల్ సప్లయ్ చేయడానికి సొంతంగా క్లాత్ స్టోర్ దుకాణం ఉండాలి. వాటికి జీఎస్‌టీ నెంబరు ఉండాలి. ఐటీ రిటర్న్స్ ఉండాలి. ఈ నిబంధనలన్నీ తుంగలో తొక్కి ఆలయ అధికారుల ఆశీస్సులతో ఉద్యోగి తన భార్య పేరు మీద టెండర్లు దక్కించుకున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ టెండర్లు నిర్వహించే సమయంలో జిల్లా స్థాయి ఉద్యోగులు ఎవరూ పాల్గొనకపోవడం గమనార్హం.



ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి దేవాలయం

టెండర్లు దక్కించుకున్నది ఉద్యోగి భార్య అని తెలియదు



దేవస్థానానికి వంటచెరకు సప్లయ్ చేయడానికి, క్లాత్ మెటీరియల్ సప్లయ్ చేయడానికి టెండర్లు దక్కించుకున్న పి. లక్ష్మి అనే మహిళ నా కార్యాలయంలో పని చేసే ఉద్యోగి భార్య అని తెలియదు. ఉద్యోగులు, వారి బంధువులు వేలం పాటలో పాల్గొనరాదు. టెండర్లు దక్కించుకోరాదు. విచారించి ఆ టెండర్లను రద్దు చేస్తాం.

- హెచ్‌జీ వెంకటేశ్, ఉరుకుంద దేవస్థానం ఈవో



ఎలక్షన్లు వ్యాపారంగా మారాయి. రూ.కోట్లు గుమ్మరించే వాళ్లకే టికెట్లు దక్కుతున్నాయి. రియల్టర్లు, కాంట్రాక్టర్లే ఇప్పుడు నాయకులవుతున్నారు. పార్టీలు అలాంటి వారినే ఏరికోరి టికెట్లు ఇస్తున్నాయి. ఇలాంటి వారంతా రాజకీయాల్లోకి రావడంతో ఎన్నికలంటేనే డబ్బులు అనే పరిస్థితి వచ్చింది. ముందుగా రూ.కోట్లు చల్లేస్తున్న నాయకులు ఆ తరువాత ఆ డబ్బును రాబట్టుకునే పనిలో పడుతున్నారే తప్ప ప్రజలకు సేవ చేయడం లేదు. ఇసుక, లిక్కర్ మాఫియాలుగా మారి అందినకాడికి దోచుకునే పనిలో పడుతున్నారు. అభివృద్ధి అనే మాటే లేకుండా చేస్తున్నారు.

కర్నూలు, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి):



మారాల్సింది ఓటరే..!

- ఎలక్షన్లు వ్యాపారమాయే..
- రూ.కోట్లు గుమ్మరించే వాళ్లకే టికెట్లు
- ఎవరెంత ఎక్కువ ఖర్చు చేస్తే వారిదే గెలుపు
- రియల్టర్లు, కాంట్రాక్టర్లను ఏరికోరి టికెట్లు ఇస్తున్న పార్టీలు
- ప్రజాస్వామ్యమా.. ధనస్వామ్యమా..?

1952లో లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆనాడు ప్రజాసేవలో పరితపించే సేవకులు.. స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధులను ఓటర్లు గుర్తించి తమ ప్రతినిధులుగా చట్టసభలకు పంపారు. 1972, 1978 ఎన్నికల వరకు జరిగిన ఎన్నికల్లో కాస్త అటు ఇటుగా ఆ విధానమే ఓటర్లు.. పార్టీల నాయకులు కొనసాగిస్తూ వచ్చారు. 1983 తర్వాత రాజకీయ పార్టీల్లోనూ.. రాజకీయ నాయకుల్లోనూ.. ఓటర్ల ఆలోచన విధానంలో కొంత మార్పు మొదలైంది. ప్రచారం పోకడలు మారిపోయాయి. ప్రజాసేవకులు ఎన్నికలకు దూరమవుతూ వచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యేల పదవులు ధనవంతుల ఇళ్లకు చేరాయి. ప్రజాశ్రేయస్సు కోసం ఖర్చు చేయాల్సిన ధనమంతా ఎన్నికల్లో గెలవడానికి పదులు, వందల కోట్ల రూపాయలు నీళ్లప్రాయంగా ఖర్చు చేస్తున్నారు. నీచ, దుష్ట సంస్కృతికి 'రెడ్ కార్పెట్' వేసి ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మార్చేశారు.



● అభివృద్ధి ఊసేదీ..!

యాభైయేళ్ల వెనక్కి వెళితే.. ఆనాటి పాలకులు శాశ్వత అభివృద్ధిపై దృష్టి సారించేవారు. ఆ పనుల్లోనూ నిజాయితీ నిష్పక్షపాతం ఉండేది. కృష్ణా నదిపై శ్రీశైలం ప్రాజెక్టు, తుంగభద్ర నదిపై తుంగభద్ర ప్రాజెక్టు నిర్మించారు. 1983లో అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ కృష్ణా జలాలు కరువు నేలకు మళ్లించాలని తప్పించారు. ఆ ఫలితమే తెలుగుగంగ ప్రాజెక్టు, హంద్రీనీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులు పురుడు పోసుకున్నాయి. రాయలసీమలో కరువు పల్లెల్లో కొంతైనా సాగునీరు అందుతోంది.. కరువు పల్లెజీవుల దాహం తీరుతోందంటే ఆనాటి పాలకుల చలువే. ఆ చిత్తశుద్ధి నేటి పాలకులకు ఏదీ..? అనే ప్రశ్నలు వెలువెత్తుతున్నాయి. దీనికి ఒకటే సమాధానం. నాడు ధన వ్యయం లేకుండా ఎన్నికైనా ప్రజాప్రతినిధులు ప్రగతిపై దృష్టి పెట్టారు. నేడు ఆ పరిస్థితి ఉందా..? పంచుడు.. ఆ తర్వాత దంచుడే తప్ప. ఎన్నికల్లో పెట్టిన ఖర్చును రాబట్టుకోవడానికి సహజ వనరులను చెరబడుతున్నారు... కొల్లగొడుతున్నారు. ప్రైవేటు ఆస్తుల్లో లిటికేషన్లు పెట్టి సెటిల్మెంట్ పంచాయితీల పేరిట లాగేసుకుంటున్నారు. సామాన్య ప్రజల కనీస అవసరాలైన సేవా రంగాలు విద్య.. వైద్యం.. మంచినీళ్లు.. రవాణా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోయాయి. వ్యాపారంగా మార్చేశారు. అసలైన అభివృద్ధి ఏదీ..? సమాధానం దొరకని ప్రశ్న ఇది.

ఓటు అమ్ముకుంటే..!



వ్యాపారంలో పెట్టుబడి పెడితే.. రాబడి ఉంటుందని సామాన్య వ్యక్తిని అడిగినా ఇట్టే చెప్పేస్తాడు. రాజకీయాల్లో పెట్టుబడి పెడితే..? ఆ డబ్బు రాబట్టుకోవడానికి ఏం చేస్తాడు..? ప్రజాస్వామ్య ముసుగేసుకుని ప్రజలపై పడి దోపిడీ చేయడం తప్పా..! అందుకే ఏ నియోజకవర్గానికి వెళ్లినా ఏమున్నది గర్వకారణం.. సమస్తం భూకబ్జాలు, పెట్రేగిపోతున్న ఇసుక, మట్టి, మద్యం మాఫియా.. ప్రతి పనికి ఓ రేటు కట్టి జనం ముక్కుపిండి వసూలు చేయడం తప్ప ప్రజా సమస్యలు పట్టించుకునే నాథుడే కరువు అయ్యారు. ఆ ఫలితమే.. అన్నదాతలు, చేనేతలు, బతుకుపోరులో అలసిసొలసిన అభాగ్యులు.. చివరికి విద్యార్థుల ఆత్మహత్యలు.. బలవన్మరణాలు నిత్యకృత్యమవుతున్నాయి. తామేదో ఉద్ధరించినట్లు ఓ చేత్తో బటన్ నొక్కి పైసలు పంచుతూ.. మరో చేత్తో ప్రత్యక్ష.. పరోక్ష పన్నులు బాదేస్తూ సగటు జీవులను పట్టి పీడించడం పాలకులకు వంతుగా మారింది. ఇది తప్పు అంటూ ప్రశ్నించే ప్రజాస్వామ్యవాదులు.. సామాజికవేత్తలపై రాజద్రోహం కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారు. కొవిడ్ సమయంలో మాస్కేది..? అని ప్రశ్నించిన ఓ దళిత వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను హింసించి.. వెంటాడి.. వేటాడి.. చివరకు పిచ్చోడు అనే ముద్రవేసి చంపేసిన ఘటన కళ్లముందే ఉంది. నోటుకు ఓటు అమ్ముకుంటే.. ఫలితాలు ఇలానే ఉంటాయని మానవ హక్కుల నేతలు గగ్గోలు పెడుతున్నారు.

● మార్పు ఎవరిలో...

రాజకీయ నాయకులు డబ్బులిస్తానన్నారు.. మేము తీసుకుంటున్నాం.. మేమేమైనా వాళ్ల ఇళ్ల కాడికి పోయి డబ్బులిస్తేనే ఓట్లేస్తామని ఏనాడైనా అడిగినామా..? ఇది సామాన్య ఓటరు ప్రశ్న. ఇందులో నిజం లేకపోలేదు. పాతికేళ్ల క్రితం ఎలక్షన్లు జరిగిన తీరును పరిశీలిస్తే.. ఓటుకు డబ్బులిచ్చే సంస్కృతి లేదు. ఉదయమే ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లాల్సి రావడంతో గ్రామ నాయకుడు ఓ చోట అల్పాహారం (టిఫిన్) పెట్టించేవాడు. మొదట్లో కూలీ పని వదులుకొని ఓటు వేయడానికి పేదలు వస్తున్నారని, కూలి డబ్బు కింద పదో పరకో ఇవ్వడం మొదలు పెట్టారు. అది కూడా అత్యంత నిరుపేదలకే. అలా మొదలైన డబ్బు పంపిణీ నోటుకు ఓట్లు కొనే స్థాయికి చేరింది.

ఎవరు ఎంత డబ్బు ఖర్చు చేస్తాడో.. ఆ అభ్యర్థే గెలిచే పరిస్థితికి తీసుకొచ్చారు. ఫలితంగా ప్రజాసేవ చేసేవాళ్లు.. ప్రజాస్వామ్యవాదులు ఎన్నికలకు దూరమయ్యారు. ధనవంతులు, కోటీశ్వర్లు, రియల్టర్లు, భూ కబ్జాలకోరులు.. బ్యాంకుల్లో రూ.వందల కోట్లు అప్పులు తీసుకొని ఎగ్గొట్టిన ఆర్థిక నేరగాళ్లు ఎలక్షన్‌లో పోటీకి సై అంటున్నారు. రాజకీయ పార్టీల్లో కూడా రూ.కోట్లు ఖర్చు చేసేటోళ్లనే ఏరికోరి మరీ తమ అభ్యర్థులుగా పోటీకి దింపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయ నాయకులు మారాలని కోరుకోవడం అవివేకమే అవుతుంది. మారాల్సింది ఓటర్లే. ప్రజా స్వామ్యాన్ని రక్షించుకోవాల్సింది ప్రజలే.

ఓటరన్నా ఎవరి పక్షమో..!

● ఎవరితోనూ నిష్టూరం కాకూడదని..

(కర్నూలు అర్బన్)



ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సగటు ఓటరు నాడి అర్థంగాక బరిలో నిలిచిన అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల సీజన్‌లో ఓటర్లకు విపరీతమైన డిమాండ్ వచ్చింది. సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనే వారు అభ్యర్థులు ఏదడిగినా కాదనకుండా ఇచ్చేస్తున్నారు. డబ్బు, మందు, బిర్యానీ, ఇలా ఎవరికి నచ్చింది వారికి సిద్ధంగా ఉంచుతున్నారు. ఇదే అదనుగా భావించిన ఓటర్లు పార్టీలతో సంబంధ లేకుండా ఎవరూ పిలిచినా వెళ్లి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఒక రోజు తెలుగుదేశం, మరో రోజు ఇంకో పార్టీ ప్రచారంలోనూ కనిపిస్తున్నారు. ఏ పార్టీ ప్రచారంలో చూసినా జనాలు మాత్రం భారీగా దర్శనమిస్తున్నారు. అందరికీ జనాలు బాగానే వస్తుండడంతో అసలు ఓటర్లు ఎవరి పక్షాన ఉన్నారో తెలియక అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. ఈ రోజు మెడలో వేసుకున్న కండువాను మరుసటి దినమే నీరు తాగినంత సులభంగా మార్చేస్తుండటంతో ఎవరు తమ వారు ఎవరు కాదనే విషయాన్ని తేల్చుకోవడం కష్టంగా మారింది. ప్రచారంలో జనం ఎక్కువగా కనిపిస్తే తాము బలంగా ఉన్నామనే సంకేతం ప్రజల్లోకి వెళ్తుందని, తద్వారా గెలుస్తామని గట్టిగా నమ్ముతున్నారు. ఇదిలా ఉంటే ఓటర్లు మాత్రం నాయకులకు ఎన్నికల సమయంలో మాత్రమే తాము గుర్తుకు వస్తామని, గెలిచినా.. ఓడినా తమను ఎలాగు పట్టించుకోరు కాబట్టి ఎన్నికల సమయంలోనే ఇచ్చినంత పుచ్చుకోవాలని భావిస్తున్నారు.

పార్థసారథిపై కోడ్ ఉల్లంఘన కేసు

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 21: ఉమ్మడి కూటమి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఈ నెల 19న నామినేషన్ వేసే సమయంలో కోడ్ ఉల్లంఘించారని, ఆయనతోపాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ గోపి తెలిపారు. నామినేషన్ దాఖలకు రిటర్నింగ్ అధికారి వద్దకు వెళ్లేటప్పుడు ఐదుగురికి మాత్రమే అనుమతి ఉందన్నారు. అయితే ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ పార్థసారథి ఐదుగురి కంటే అధికంగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి వెళ్లారని చెప్పారు. దీంతో సహాయ రిటర్నింగ్ అధికారి హసీనా సుల్తానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని, పార్థసారథితోపాటు మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, గుడిసె కృష్ణమ్మ, బుద్ధా రెడ్డి రామచంద్రపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తెరపైకి టోకెన్ సంస్కృతి


ఎమ్మిగనూరు, ఏప్రిల్ 21: ఎమ్మిగనూరులో తెరపైకి కొత్త సంస్కృతి వచ్చింది. సభలు, సమావేశాలకు వచ్చే జనాలకు అధికార పార్టీ టోకెన్లు ఇవ్వడం మొదలు పెట్టింది. కార్యక్రమం ముగిసిన తర్వాత టోకెన్ ఇచ్చిన వారికి ముందుగా నిర్ణయించిన మొత్తాన్ని ఇస్తున్నారు. దీంతో ఎక్కడ ఏ పార్టీ సమావేశాలు, సభలు, ర్యాలీలు జరిగినా టోకెన్లు ఎవరు ఇస్తారు.. ఎక్కడ ఇస్తారంటూ జనం ఎగబడుతున్నారు. ఇప్పుడు మిగతా పార్టీలు కూడా ఇదే దారి పట్టాయి. దీంతో ఏదో ఒక రాజకీయ పార్టీ సమావేశం ఏర్పాటు చేసిందంటే జనాలు ఆఘమేఘాలపై వెళ్లి టోకెన్లు తెచ్చుకుంటున్నారు. టోకెన్ ఉందంటే రూ.300 నుంచి రూ.500 వరకు చేతికి వచ్చినట్టే.

ఆ ముగ్గురికీ వాల్మీకి అభ్యర్థులే పోటీ


మంత్రాలయం, ఏప్రిల్ 21: మండలంలోని రాంపురంరెడ్డి సోదరులు వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నుంచి ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి పోటీని ఎదుర్కొంటున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి బోయ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి నుంచి పోటీ ఎదుర్కొంటున్నారు. ఆదోని నియోజకవర్గంలో వైసీపీ నుంచి సాయిప్రసాద్ రెడ్డి బరిలో దిగగా బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి పోటీలో ఉన్నారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నుంచి వైసీపీ నుంచి వెంకట్రామిరెడ్డి పోటీ చేస్తుండగా టీడీపీ నుంచి మాజీ మంత్రి గుమ్మనూరు జయరాంలను టీడీపీ అధిష్టానం బరిలో దింపింది. రాంపురంరెడ్డి సోదరులకు టీడీపీ నుంచి ముగ్గురు వాల్మీకి బీసీ సామాజిక వర్గానికి చెందిన వారే పోటీ ఇస్తుండటంతో ఆసక్తికరంగా మారింది.



రాఘవేంద్రరెడ్డి



జయరామ్



పార్థసారథి



బాలనాగిరెడ్డి



వెంకట్రామిరెడ్డి



సాయిప్రతాప్‌రెడ్డి

పునర్విభజనలో తొలి జెండా టీడీపీదే

మంత్రాలయం, ఏప్రిల్ 21: 2009 రాష్ట్ర పునర్విభజనలో మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంగా కొత్త నియోజకవర్గంలో మంత్రాలయం గడ్డపై తెలుగుదేశం పార్టీ జెండా రెపరెపలాడింది. 2009లో మంత్రాలయం కేంద్రంగా కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం మండలాలను కలిపి నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. గతంలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోకి మంత్రాలయం, పెద్దకడుబూరు, కోసిగి మండలాలు ఉండేవి. కౌతాళం మండలం మాత్రం ఆదోని నియోజకవర్గంలో ఉండేది. పునర్విభజనలో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఆదోని నియోజకవర్గంలోని ఒక మండలాన్ని కలిపి కొత్త నియోజకవర్గం ఏర్పాటైంది. కొత్తగా ఏర్పడిన నియోజకవర్గంలో జరిగిన మొదటి ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన బాలనాగిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి దళవాయి రామయ్యపై 10,697 ఓట్ల మెజారిటీతో మంత్రాలయం గడ్డపై తొలి టీడీపీ జెండా ఎగురవేశారు. అయితే.. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రావడంతో బాలనాగిరెడ్డి కాంగ్రెస్‌లోకి వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కలిశారు. పీఆర్పీ నుంచి పోటీ చేసిన వాల్మీకి సామాజికవర్గానికి చెందిన ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్. రాఘవేంద్రరెడ్డి తండ్రి దివంగత మాధవరం రామిరెడ్డి రూ.10,176 ఓట్లతో సరిపెట్టుకున్నారు. దీంతో మంత్రాలయం తొలి నియోజకవర్గంలో తొలి టీడీపీ జెండా ఎగిరింది. అయితే.. బాలనాగిరెడ్డితోపాటు పీఆర్పీతో పోటీ చేసిన రామిరెడ్డి, కాంగ్రెస్ నుంచి ఓడిపోయిన దళవాయి రామయ్యతో జతకట్టి ముగ్గురు నేతలు కాంగ్రెస్‌లోనే కొనసాగారు. 2009 సెప్టెంబరు 2న వైఎస్సార్ దుర్మరణం చెందడంతో ఆయన కుమారుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంట వై.బాలనాగిరెడ్డి, రామిరెడ్డి నడిచారు. 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి బాలనాగిరెడ్డి, ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి పోటీలో నిలబడగా.. బాలనాగిరెడ్డి తిక్కారెడ్డిపై 7,462 ఓట్ల మెజారిటీతో గెలుపొందాడు. 2019లో ఇదే రిపీట్ అయి తిక్కారెడ్డిపై బాలనాగిరెడ్డి 23,879 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా బాలనాగిరెడ్డి నిలిచారు. మంత్రాలయం నియోకవర్గంలో వాల్మీకి, కురువ, ఎస్సీ సామాజికవర్గాలు చెందిన ఓటర్లే అధికంగా ఎమ్మెల్యే అభ్యర్థిని ఇక్కడ శాసిస్తున్నాయి. మంత్రాలయం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 2,07,682 మంది ఓటర్లు ఉండగా.. ఇందులో మహిళలు 1,05,827 మంది కాగా, పురుషులు 1,01,834 మంది ఉన్నారు. ఇతరులు 21 మంది ఉన్నారు. ఇందులో నియోజకవర్గంలో 237 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కౌతాళం మండలంలో 69, కోసిగి మండలంలో 62, మంత్రాలయం మండలంలో 57, పెద్దకడుబూరు మండలంలో 49 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం జరిగే సార్వత్రిక ఎన్నికల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వై.బాలనాగిరెడ్డి నాల్గవసారి వైసీపీ నుంచి బరిలో దిగుతుండగా.. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన దివంగత రామిరెడ్డి తనయుడు ఎన్.రాఘవేంద్రరెడ్డి పోటీల్లో ఉన్నారు. వీరిద్దరి మధ్య నువ్వా.. నేనా అన్న రీతిలో పోటీ నడుస్తోంది. ఇరువురు నేతలు ఒకరు బీసీ వాల్మీకి వర్గానికి చెందడం, ఈ నియోజకవర్గంలో బీసీ సామాజికవర్గానికి చెందిన వాల్మీకి ఓటర్లు అత్యధికంగా ఉండటంతో టీడీపీ అభ్యర్థికి కలిసొచ్చే అవకాశాలు అధికంగానే ఉన్నట్లు సమాచారం. మంత్రాలయం రాఘవేంద్రుని ఆశీస్సులు ఎవరిపై ఉంటాయో మే 13న పోలింగ్ అనంతరం జూన్ 4న ఫలితాల్లో తేలనుంది.



మంత్రాలయం ముఖద్వారం

తాయిలాలు తీసుకున్నా నేరమే

● జర జాగ్రత్త..!



కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 20: ఎన్నికల్లో తాయిలాలు కీలకంగా మారాయి. గెలుపు కోసం అభ్యర్థులు ఓటర్లను ప్రలోభ పెడుతూ మద్యం, నగదు, క్రీడా సామగ్రి, చీరలు, గృహోపకరణాలు తదితర వస్తువులు ఇస్తున్నాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం తాయిలాలు ఇచ్చిన వారితోపాటు తీసుకున్నా నేరమే. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 123 ప్రకారం తాయిలాలు ఇచ్చేవారు, స్వీకరించేవారు కూడా నిందితులే. సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసి నిరూపించగలిగితే.. చట్టప్రకారం శిక్షార్హులవుతారు. ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటు వేయాలంటూ ఎన్నికల సంఘం ముద్రించిన కరపత్రాలను పోల్ చీటీలతో పాటు బీఎల్వో ఓటర్లకు అందజేస్తున్నారు. ప్రలోభాలపై ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, సమాచారం తెలిసినా టోల్‌ఫ్రీ నెంబర్.1950కి ఫిర్యాదు చేయవచ్చు.

దొంగ ఓట్లు కనిపెట్టేయండిలా...

● గూగుల్ తల్లిని అడిగితే సరి



దొంగ ఓట్లను సులభంగా కనిపెట్టేయవచ్చు. ఇందు కోసం గూగుల్ వెబ్ బ్రౌజర్‌లో ceoap-erolls.ap.gov.in/ namesearch/ నొక్కండి.. 'ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్' పేరుతో ఉన్న పేజీ ఓపెన్ అవుతుంది. ఇందులో మీ జిల్లా, నియోజకవర్గాన్ని ఎంచుకోవాలి. హౌస్ నెంబర్ ఆప్షన్‌లో మీ ఇంటి డోర్ నెంబరు నమోదు చేయాలి. 'క్యాప్చా' ఎంటర్ చేసి సెర్చ్ కొడితే చాలు.. ఆ ఇంటి నెంబరులో మొత్తం ఎంత మంది ఓటర్లు ఉన్నారు..? వారి పేర్లు వయస్సు, ఓటరు కార్డు నెంబరు, వారి పోలింగ్ కేంద్రం నెంబరు, వారి ఓటరు వరుస నెంబరు వంటి వివరాలన్నీ వచ్చేస్తాయి. మీ ఓటు కూడా కనిపిస్తుంది. మీ కుటుంబ సభ్యుల పేర్లు కాకుండా.. అపరిచితుల పేర్లు ఉంటే అవి దొంగ ఓట్లు కింద లెక్క. వెంటనే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడమే. ఒకవేళ ఆ డోర్ నెంబరులో గతంలో మీ ఓటు ఉండి.. ఇప్పుడు కనిపించకపోతే మీ ఓటు పోయినట్లే.. కొత్త ఓటు నమోదు చేసుకోవాలి.

-కర్నూలు కలెక్టరేట్

పోస్టల్ బ్యాలెట్‌లో గుర్తులుండవ్..!

● అవును మరి



గుర్తులు లేకుండా ఎన్నికలు ఏంటా అని సందేహం రావొచ్చు. ఇది నిజమే. పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులు ఉండవు. అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. సార్వత్రిక ఎన్నికల రోజు విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగిస్తారు. అంతకు ముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకు ఇచ్చేవారు. వచ్చిన వాటిల్లో చివరి వాటిని తీసి పోస్టల్ ఓటు వేసే ఉద్యోగులకు అందజేసేవారు. ఈవీఎం యంత్రాలు వచ్చిన తర్వాత ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు యంత్రంలో ఓటువేసే పరిస్థితి లేకపోవడంతో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. దీన్ని బట్టి వారి ప్రాంతాల్లో పోటీ చేసే అభ్యర్థి పేరు, పార్టీ పేరు ముద్రిస్తారు. గుర్తు ఉండకపోవడంతో అభ్యర్థి పేరు పక్కన టిక్ పెట్టాల్సి ఉంటుంది.

- కర్నూలు కలెక్టరేట్

డిపాజిట్ ఎంతంటే..!

జస్ట్ ఇన్ఫర్మేషన్



ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ ఫారంతో పాటు నిర్ణీత డిపాజిట్ (ధరావతు) చెల్లించాల్సి ఉంటుంది. ఎంపీ అభ్యర్థులైతే రూ.25వేలు, ఎస్సీ, ఎస్టీలైతే రూ.12,500లు, అసెంబ్లీ అభ్యర్థులైతే రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5వేలు చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా ఎన్నికల్లో పోలైన వాటిలో చెల్లిన ఓట్లలో ఆరో వంతుకు మించితే ఆ అభ్యర్థి చెల్లించిన డిపాజిట్‌ను తిరిగి చెల్లిస్తారు. లేకుంటే ఆ డిపాజిట్‌ను ఎన్నికల సంఘమే జప్తు చేసుకుంటుంది. ఎన్నికల ఫలితాలు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురితం చేసిన తర్వాత మాత్రమే అర్హులైన అభ్యర్థులకు డిపాజిట్ తిరిగి ఇచ్చేస్తారు.

- కర్నూలు కలెక్టరేట్

మీకు ఏం కావాలో చెప్పండి

● ఎంత ప్రేమో..!



ఆదోని, ఏప్రిల్ 21: ఎన్నికల్లో పోటీ చేస్తున్న పలువురు అభ్యర్థులు పట్టణ శివారున అభివృద్ధి కానీ కాలనీలపైనే ప్రత్యేక దృష్టి సారించారు. మామూలు రోజుల్లో ఆ కాలనీల వైపు కన్నెత్తి కూడా చూడని నాయకులు ఇప్పుడు వారిని ఆకట్టుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. వారిపై ఉన్నట్లుండి ప్రేమ ఒలకబోస్తున్నారు. వారితో కలిసి ఫొటోలు దిగుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే తాను చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తుండగా, ప్రతిపక్ష అభ్యర్థులు వారు చేయబోయే పనులకు గురించి వివరిస్తున్నారు. పట్టణ శివారు కాలనీలో నివసించేవారిలో 60 శాతం మంది పోలింగ్‌లో కచ్చితంగా పాల్గొంటున్నారు. అభ్యర్థుల గెలుపోటములలో వీరు కీలకమవుతున్నారు. ఈ విషయాన్ని గమనించి అభ్యర్థులు శివారున ఉన్న కాలనీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆ కాలనీలో తాము చేపట్టనున్న కార్యక్రమాలు వివరిస్తూ వారి మద్దతు పొందడానికి ప్రయత్నిస్తున్నారు. వారితో రహస్య సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆ ఓటర్ల సంఖ్యను బట్టి నాయకులకు డబ్బు ముట్ట చెబుతున్నట్లు తెలుస్తోంది.

మాట ఇచ్చి మడమ తిప్పారు..

● ఎరక్కపోయి...



ఆదోని, ఏప్రిల్ 21: మాట ఇచ్చి అప్పుడే మడమ తిప్పేశారు. మా పార్టీలోకి వస్తే ఏమోమో చేస్తామని చెప్పి అప్పుడే ముఖం చాటేస్తున్నారు. ఈ మాటలు నమ్మి సదరు నాయకుల కండవాలు కప్పేసుకున్నారు. పార్టీ మారడానికి కుదుర్చుకున్న డీల్‌ను వెంటనే సెటిల్ చేస్తారని భావించారు. తర్వాత పట్టించుకునే వారే లేదు. పలకరించేవారు కరువయ్యారు. ఆదోని డివిజన్ పరిధిలోని ఆ వ్యక్తి ప్రధాన పార్టీకి టికెట్ ఆశించారు. దక్కలేదు. ప్రత్యర్థి పార్టీ గాలం వేసింది. పార్టీ మారగానే కొన్ని ప్యాకేజీలు, అధికారంలోకి రాగానే పదవులు ఇస్తామని హామీ ఇచ్చింది. సదరు వ్యక్తి వెనువెంటనే ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. రోజులు గుడస్తున్నా ప్యాకేజీ అందలేదు... పోని ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తారో తెలుసుకుందామని ప్రయత్నిస్తే ఎవ్వరూ స్పందించడం లేదు. ఆర్థికపరమైన హామీకి సంబంధించి ఫలానా వ్యక్తి తీరుస్తాడంటూ పార్టీ నేతలు చెప్పారు. ఆయన కూడా పట్టించుకోవడం లేదు. దీంతో సదరు నేత ఎరక్కపోయి ఇరుక్కుపోయానన్న భావనలో ఉన్నారు.

వాహనాల తనిఖీ

సి.బెళగల్, ఏప్రిల్ 21: మండల కేంద్రమైన సి. బెళగల్‌లో ఎస్‌ఐ తిమ్మారెడ్డి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆటోలు, కారులు, బైకుల్లో అధిక మొత్తం డబ్బులను పెట్టుకుని ప్రయాణాలు చేసిన వారు పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే తగిన ఆధారాలు చూపాలన్నారు. తనిఖీల్లో భాగంగా రూ.1675 జరిమానా వసూలు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుల్, పోలీసులు ఉన్నారు.

రాక్షస పాలనను అంతం చేద్దాం

సి.బెళగల్, ఏప్రిల్ 21: రాక్షస పాలనను అంతం చేద్దామని టీడీపీ సీనియర్ నాయకుడు రేపల్లె పౌలు అన్నారు. ఆదివారం మండలంలోని ముడుమాల గ్రామంలో బాబు సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పౌలు మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రేపల్లె బజారి, రాముడు, శ్రీనప్ప, మద్దిలేటి పాల్గొన్నారు.

24న హజ్ యాత్రికులకు శిక్షణ

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 21: కర్నూలు జిల్లా జమియత్ ఉలమా, ఆల్ మదీనా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో హజ్‌కు వెళ్లే యాత్రికులకు 24న శిక్షణ ఇవ్వనున్నట్లు జమియత్ ఉలమా జిల్లా అధ్యక్షుడు మౌలానా డా. ఖాజీ అబ్దుల్ మజీద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి నగరంలోని బుధవారపేట మెరీడియన్ ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకు వచ్చే యాత్రికులు నోటు పుస్తకం, పెన్ను తీసుకురావాలని, వివరాలకు 9032875378కు సంప్రదించాలని సూచించారు.

ఉచిత వైద్యశిబిరం

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 21: నగరంలోని శరీన్‌నగర్‌లో అమీలియా ఆసుపత్రి సహకారంతో ఎస్‌ఎంబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ పేద ప్రజలు వైద్యానికి దూరంగా ఉంటూ ఆసుపత్రులకు వెళ్లలేని వారికి వైద్యశిబిరాలు ఉప యోగపడతాయన్నారు. కార్యక్రమంలో అమీలియా ఆసుపత్రి ఎండీ డా.లక్ష్మీప్రసాద్, ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా, ముస్లిం మైనార్టీ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర నాయకుడు షోయేబుద్దీన్ ఖాద్రి పాల్గొన్నారు.

గోరంత ఇచ్చి కొండంత దోచిన జగన్

పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు ముంతాజ్



మాట్లాడుతున్న టీడీపీ నాయకురాలు షేక్ ముంతాజ్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 21: సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చేది గోరంతా.. దోచుకునేది కొండంతా అని కర్నూలు పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు షేక్ ముంతాజ్ ధ్వజమెత్తారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసి సమావేశంలో ఆమె మాట్లాడారు. డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా చంద్రబాబు పాలనలో కోటి మంది మహిళలు ఒక్కొక్కరు సమానంగా రూ.20వేలు లబ్ధి పొందారని, కానీ జగన్‌రెడ్డి ఆసరాతో 78 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేస్తూ 35 లక్షల మందికి టోకారా వేశారని మండి పడ్డారు. జగన్ పాదయాత్ర సమయంలో మద్య నిషేదం చేస్తానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మద్యం రేట్లను 3 రెట్లు పెంచారన్నారు. ఈ సమావేశంలో సి.రేణుకా, పి.లలిత కుమారి పాల్గొన్నారు.

టీడీపీతోనే సమస్యలు పరిష్కారం



పథకాలను వివరిస్తున్న టీడీపీ శ్రేణులు

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 21: తెలుగుదేశం పార్టీతోనే గ్రామాల్లోని సమస్యలు పరిష్కారం అవుతాయని అల్లినగరం టీడీపీ నాయకులు మేకల శంకర్, పట్టి మధు అన్నారు. ఆదివారం సాయంత్రం వారు అల్లినగరం గ్రామంలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికులు ఇళ్లు, పించన్లు మంజూరు కాలేదని, డ్రైనేజీ సమస్యలపై టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో రైతులు, మహిళలు, నిరుద్యోగులు, విద్యార్థులందరికీ మేలు చేకూరుతుందన్నారు. వైసీపీ పాలనలో దోపిడీ, దౌర్జన్యాలు తప్ప అభివృద్ధి లేదన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లా, గిడ్డయ్య, రాముడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సుంకులా పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు

గూడూరు, ఏప్రిల్ 21: మండలంలోని కె. నాగలాపురం గ్రామంలో సుంకులా పరమేశ్వరిదేవి బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమై ఈనెల 24వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ



కార్యనిర్వహణాధికారి టీవీ నరసయ్య తెలిపారు. సోమవారం గణపతి, పుణ్యహవాచనం, కంకణధారణ, అంకురార్పణ, మండపరాధన, రాత్రి 8గంటలకు ప్రభోత్సవం నిర్వహిస్తామ న్నారు. 23న సాయంత్రం రథోత్సవం, 24న లింగమన్న పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామని ఈవో తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్య క్రమాలను నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవా లను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈసందర్భంగా అమ్మవారి ఆల యాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ప్రశ్నిస్తే దాడులా ?

కల్లూరు, ఏప్రిల్ 21: టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు రద్దు చేశారని అసత్య ప్రచారం చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపా ల్‌రెడ్డిని ప్రశ్నించిన జనసేన నాయకుడు సలాంపై దాడి చేయడం సిగ్గుచేటని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తడకనపల్లె గ్రామంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో రామయ్యతాత కూడలిలో నిర్వహించిన సభలో టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను రద్దు చేశారన్న కాటసాని ప్రసంగాన్ని జనసేన నాయకుడు సలాం అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని అన్నారు. దీంతో కాటసాని అనుచరులు జనసేన నాయకుడు సలాంపై దాడి చేసి గాయపరిచారు. ఈమేరకు ఆదివారం గౌరు వెంకటరెడ్డి తడకనపల్లె జనసేన నాయకుడు సలాం ఇంటికి చేరుకుని దాడి ఘటనను అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ కూటమి సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోనన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులకు తాము అండగా ఉంటామన్నారు. గ్రామంలో



జనసేన నాయకుడు సలాంను పరామర్శిస్తున్న గౌరు

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అధికార పార్టీ నాయకులు ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించుకునేందుకు సహకరించాలని హితవు పలికారు. ఆయన వెంట ఉమ్మడి కర్నూలు జనసేన జిల్లా అధ్యక్షుడు చింతాసురేష్ ఉన్నారు.

జనసేన నాయకుడు సలాంపై దాడిని ఖండించిన గౌరు



టీడీపీలో చేరిన బస్తిపాడు వైసీపీ నాయకులు

గౌరు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

పాణ్యం టీడీపీలోకి వైసీపీ నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. కల్లూరు మండలం బస్తిపాడు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఆదివారం నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి సమక్షంలో మునిస్వామి, శేఖర్‌తోపాటు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి గౌరు వెంకటరెడ్డి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమన్నారు. పాణ్యం నియోజకవర్గంలో గౌరు చరిత గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డి.రామాంజనేయులు పాల్గొన్నారు.

వర్షంతో అనుబంధం చెప్పే కవిత్వమే రెయిన్ కేఫ్

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 21: వర్షానికి మనిషి జీవితానికి గొప్ప అనుబంధం ఉందని ప్రముఖ కవి అనిల్ డానీ అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు వెంకటేశ్ రాసిన 'రెయిన్ కేఫ్' కవితా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. రాయలసీమ ప్రచురణలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన ప్రముఖ కవి బండ్ల మాధవరావు ఆవిష్కరించగా, కవి కెంగార మోహన్ సభాధ్యక్షత వహించారు. అనిల్ డానీ మాట్లాడుతూ వానపై రాసే ఏ కవిత్వమైనా హృదయానికి చేరువ అవుతుందని, మనిషి జీవనానికి వానతో ముడిపెట్టి చెప్పటం గొప్ప కవిత్వ పద చిత్రానికి నిదర్శనమని అన్నారు. చినుకంటే మెతుకని, మెతుకంటే మనిషని, మనిషంటే చరిత్రని మరచిన పాఠం మరోసారి చదువుకుందాం అంటూ కవి తన క తాత్వికతను చెప్పారని ప్రశంసించారు. బండ్ల మాధవరావు మాట్లాడు తూ వర్షం పల్లెలను అనాథలుగా వదిలేసిందని కవి చెప్పడం అనిర్వచ నీయమని అన్నారు. విశిష్ట అతిథి శ్రీశ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వరరావు మాట్లాడుతూ నలభై ఏళ్ల సుదీర్ఘ సాహిత్య ప్రస్థానంలో భిన్నమైన కవి త్వాన్ని చూస్తున్నానని అన్నారు. . కథా రచయిత మారుతి పౌరోహితం మాట్లాడుతూ తమ ప్రచురణల్లో సీమ అస్తిత్వ పరిమళాలను వెదజల్లే రచనలను, కవులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు.

కేవీ సుబ్బారెడ్డి కళాశాల విద్యార్థుల ప్రతిభ

కర్నూలు (కల్చరల్), ఏప్రిల్ 21: నగర శివారు దూపాడులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఎంబీఏ కళాశాలకు చెందిన



అధ్యాపకులతో కేవీ సుబ్బారెడ్డి కళాశాల విద్యార్థులు

స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల నంద్యాలలోని ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం నిర్వహించిన కైజెన్-2కే24 జాతీయస్థాయి బిజినెస్ మేనేజ్‌మెంట్ పోటీల్లో కేవీ సుబ్బారెడ్డి ఎంబీఏ కళాశాల విద్యార్థులు కె.అఖిల, యం.యశ్వంత్, ఎస్.బందేనవాజ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ ఈవెంట్‌లో ప్రథమ బహుమతులు సాధించారు. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ కె.విశ్వమోహన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులకు చదువుతోపాటూ వివిధ అంశాల్లో శిక్షణలు ఇస్తున్నామన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఓ.రవిశంకర్, కేవీఎస్‌ఎం ప్రిన్సిపాల్ అంజనప్ప, డాక్టర్ కే రామాంజినేయులు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ రవి, సమన్వయ కర్త ఆర్ సర్వేశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఆదివాసులపై కగార్ యుద్ధాన్ని ఆపాలి

ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నేతలు



నిరసన ప్రదర్శన చేస్తున్న ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 21: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో నివసిస్తున్న ఆదివాసులపై భారత సైన్యం ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న యుద్ధాన్ని నిలిపివేయాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. గత మూడు నెలల్లో 80 మందికి పైగా ఆదివాసులను, విప్లవకారులను కేంద్ర బలగాలు హత్య చేయడాన్ని నిరసిస్తూ 'ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక' ఆధ్వర్యంలో ఆదివారం ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దండకారణ్యం ప్రాంతంలో భారత సైన్యం రెండు విడుతలుగా కాల్పులు జరిపి ఎనభై మంది ఆదివాసును చంపేసిందని, ఇందులో ఎక్కువ మంది మహిళలేనని అన్నారు. తక్షణం భారత సైన్యం ఆదివాసులపై చేస్తున్న యుద్ధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విరసం నాయకుడు పాణి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించి దేశవ్యాప్తంగా ఉన్న వనరులను కార్పొరేట్లకు ఇవ్వాలనే కేంద్ర ప్రభుత్వ వ్యూహం మేరకే ఈ హత్యాకాండ జరుగుతున్నదని అన్నారు. దేశాన్ని కార్పొరేట్ ఇండియాగా మార్చేయడమే కేంద్ర ప్రభు త్వ లక్ష్యమని అన్నరు. ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు భార్గవ మాట్లా డుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలపై యుద్ధా న్ని ప్రకటించి డ్రోన్ విమానాల ద్వారా బాంబులను వేస్తూ ఉందని, తక్షణమే ఈ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ విద్యావంతుల వేదిక కో కన్వీనర్ రత్నం ఏసేపు మాట్లాడుతూ , చత్తీస్‌ఘడ్ ప్రాంతంలో రెండువందల యాభై పోలీసు బేస్ క్యాంపులను ఏర్పాటు చేసిందని అన్నారు. దేశ ప్రజలపై దేశ సైనికులు యుద్ధం చేయడం దారుణమని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకుడు మనోహర్ మాణిక్యం, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, కుల నిర్మూలన పోరాట సమితి నాయకుడు ఏవీ సుబ్బరాయుడు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు వెంకటేశ్వర్లు, ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు యోహాను, జేవీవీ బాధ్యుడు రామాంజినేయులు, సీమ విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

బీ ఫారం అందుకున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 21: కర్నూలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ బీ ఫారమ్ అందుకున్నారు. ఆదివారం ఉండవల్లిలో పార్టీ అధినేత చంద్ర బాబు నాయుడు నివాసంలో ఆయన చేతుల మీదుగా బీ ఫారమ్ తీసుకున్నట్లు టీజీ భరత్ తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం కృషి చేస్తానని ప్రమాణం చేశానని తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నేతలందరిని కలు పుకుని సమిష్టిగా కష్టపడతానని పేర్కొన్నారు.



చంద్రబాబు చేతుల మీదుగా బీ ఫారమ్ అందుకుంటున్న టీజీ భరత్

24న బొగ్గుల దస్తగిరి నామినేషన్

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 21: కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ఈనెల 24న వేయనున్న నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 10గంటలకు నామినేషన్ కార్యక్రమం ఉంటుందన్నారు. కోడుమూరు, గూడూరు, సీ.బెళగల్, కర్నూలురూరల్ మండలాల నుంచి బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని విష్ణువర్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కాగా విజయవాడలోని ఉండవల్లిలో చంద్రబాబు నివాసంలో ఆదివారం కోడుమూరు అసెంబ్లీ నియోజికవర్గ (ఎస్సీ) స్థానానికి బొగ్గుల దస్తగిరికి చంద్రబాబు టీడీపీ బీఫారం అందజేశారు.

రోగులకు కంటి సమస్యలు వస్తున్నాయి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఐ హాస్పిటల్ సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 21: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి పాత గైనిక్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో చెత్తచెదారం వేసి కాల్చేస్తున్నారనీ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ మూడురోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెత్తను కాల్చేయడం వల్ల దాని నుంచి వచ్చే పొగతో కంటి ఆసుపత్రిలోని రోగులకు ఇబ్బంది పడుతున్నారని, కంటి సమస్యలు అధికమవుతున్నారని ఫిర్యాదులో పేర్కొ న్నారు. ఖాళీ స్థలంలో చెత్తను వేయకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రశాంతంగా ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్ష

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 21: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామూయేలు తెలిపారు. జిల్లాలోని 16 ఆదర్శ పాఠశా లలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం మొత్తం 3923 మంది విద్యార్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షకు 3521 మంది విద్యార్థులు హాజర య్యారు. జిల్లాలో 89.75 శాతం నమోదైంది.

ఏపీటీఎఫ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 21: ఏపీటీఎఫ్ నూతన జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం స్థానిక బ్రహ్మారెడ్డి ప్రజావైద్యశాల కాన్ఫరెన్స్ హాల్లో నూతన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.ఇస్మాయిల్, ప్రధాన కార్యద ర్శిగా మరియానందం, గౌరవాధ్యక్షుడిగా కమలాకర్‌రావు, అదనపు ప్రధాన కార్య దర్శిగా శేషయ్య, సహాయ అధ్యక్షుడిగా స్వామినాథన్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు హాజరయ్యారు. ఈసమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లు, మండలాల నాయకులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

మంత్రాలయం, ఏప్రిల్ 21: మండలంలోని మాధవరం చెట్నహళ్లి గ్రామాల మధ్య జాతీయ రహదారిహైవే రోడ్డు పక్కన శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో జింక మృతి చెందింది. రోడ్డు పక్కనే ఉన్న ప్రయాణికులు సంఘటన గురించి మంత్రాలయం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఫారెస్టు అధికారులు మహేంద్రనాయుడు, బీట్ ఆఫీసర్ అనురాధ, శంకర్ నాయక్ జింక మృతదేహాన్ని పశువైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు. మగ జింకగా గుర్తించి పొడవు, వెడల్పులు లెక్కించి నమోదు చేసి పంచనామా నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేసిన షర్మిల

నంద్యాల టౌన్, ఏప్రిల్ 21: నంద్యాల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా డీసీసీ అధ్యక్షుడు జంగిటి లక్ష్మీనరసింహ యాదవ్‌ను అధిష్ఠానం ఖరారు చేసింది. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఏపీ న్యాయయాత్రలో భాగంగా బస్సు యాత్ర జిల్లాలో ప్రారంభమైంది. తొలిరోజునే జిల్లాలో ఎంపీ అభ్యర్థిగా లక్ష్మీనరసింహ యాదవ్‌ను ఖరారు చేయడంతో పాటు బీ ఫారంను కూడా అందజేశారు. ఇప్పటికే నంద్యాల అసెంబ్లీ నుంచి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి, నందికొట్కూరు నుంచి తొగూరు ఆర్థర్‌ను ప్రకటించారు. తాజాగా ఎంపీ అభ్యర్థిగా లక్ష్మీనరసింహ యాదవ్‌తో పాటు డోన్ అభ్యర్థిగా గార్లపాటి మద్దిలేటి స్వామి, ఆళ్లగడ్డ అభ్యర్థిగా బి.హుసేన్‌బాషా, శ్రీశైలం అభ్యర్థిగా సయ్యద్ ఆసర్ ఇస్మాయిల్, బనగానపల్లె అభ్యర్థిగా గూటం పుల్లయ్య (బాలు యాదవ్)లను ప్రకటిస్తూ బీ ఫారంలను పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అందజేశారు.



బీ ఫారం అందుకుంటున్న నంద్యాల ఎంపీ అభ్యర్థి లక్ష్మీనరసింహ యాదవ్

శ్రీవిజయదుర్గ హాస్పిటల్ ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 21: నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన శ్రీవిజయదుర్గ హాస్పిటల్‌ను ఆదివారం ఉదయం శ్రీదుర్గా ఆటో మొబైల్స్ అధినేత సుధా మల్లికార్జునరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ వై.ప్రవీణ్ కుమార్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా.బాలమద్దయ్యలు ప్రారంభించారు. ఈసందర్భంగా విజయదుర్గ హాస్పిటల్ అధినేత డా.నాగశేషయ్య మాట్లాడుతూ గత పదేళ్లుగా ఆర్థో విభాగానికి వైద్యునిగా



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఎంహెచ్‌వో, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షుడు బాలమద్దయ్య

సేవలందించానని, ఇప్పుడు గాయత్రీ ఎస్టేట్‌లో అన్ని విభాగాలతోపాటు సూపర్ స్పెషలిటీ సర్వీసులు ఉండేవిధంగా హాస్పిటల్‌ను ప్రారంభించామన్నారు. మధ్యతరగతి ప్రజలకు సేవలు అందు బాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో శ్రీవిజయదుర్గా కార్డియాక్ సెంటర్ అధినేత డాక్టర్ వసంతకుమార్, ఐఎంఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రామ చంద్ర నాయుడు, డాక్టర్ ఎస్‌వీ రామ్మోహన్ రెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు



టీడీపీలో చేరిన ఎస్సీ కాలనీ యువకులతో విష్ణు

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 21: కోడుమూరు నియోజకవర్గంలో టీడీపీలోకి వైసీపీ శ్రేణులు భారీగా చేరుతున్నారు. స్టాంటన్‌పురం, మాసమసీదు, మామిదాలపాడు, మునగాలపాడు వైసీపీ నాయకులతోపాటు గీతాముఖర్జీనగర్ చెందిన 38వ వార్డు వైసీపీ కార్పొరేటర్ రాచపూడి రవికుమార్(గిప్సన్)తోపాటు 500 మంది వైసీపీ కార్యకర్తలు ఆదివారం టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి విష్ణు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో సుందర్‌రాజు, జయనారాయణ, దేవరాజు, భాస్కర్, దేవదానం, ప్రకాశం, దేవానంద్, యిర్మియా, చరణ్, సునీల్, మహేష్ ఉన్నారు. కార్యక్రమంలో స్టాంటన్ పురం టీడీపీ నాయకులు మాజీ సర్పంచు రాచపూడి సుమియోన్, రేపల్లె మార్కండేయులు, భీసన్న, వీరభద్ర పాల్గొన్నారు.


● సి.బెళగల్ మండలానికి చెందిన బీజేపీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డిని కలిశారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో మండల నాయకులు బస్తి ఈరన్న, చిన్నదేవమ్మ, మద్దిలేటి, శ్రీనివాసులు, ఉమశంకర్, రాఘవేంద్ర, పూలకాంత్, మహిళా మోర్చా నాయకురాలు ఉమాదేవి, జానకి, కిసాన్ మోర్చా రాముడు ఉన్నారు.

● గూడూరు మండలం మునగాల గ్రామానికి చెందిన 150 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ సీనియర్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో మద్దిలేటి, డీలర్ షడ్రక్, రాజు, చిన్న, మునెప్ప, సురేష్, తిక్కయ్య, పెద్దమద్దిలేటి, అబ్రహం ఉన్నారు.

● కోడుమూరు మండలం పులకుర్తి గ్రామం నుంచి 30మంది వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో నాయుడు, గిడ్డయ్య, సుంకన్న, లక్ష్మన్న, నాగేంద్ర, గోపాల్, సాయి, భీముడు, రామాంజనేయులు, రంగన్న, మహబూబ్ బాషా, నాగరాజు, వెంకటేష్ ఉన్నారు.

● కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు పరిధిలో వెంకన్నబావికి చెందిన దాదాపు 30 కుటుంబాలు విష్ణును కలిసి సంపూర్ణ మద్దతు తెలిపారు. మద్దతు తెలిపిన వారిలో రుద్రకృష్ణ, శివ, గణేష్, శివ, డేవిడ్ అనిల్, నరేష్, సుమ న్, ఫజిల్, అరుణ్, సునీల్ ఉన్నారు.

సి.బెళగల్, ఏప్రిల్ 21: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన వైసీపీ యువకులు, పెద్దలు ఆదివారం టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో గోపాల్, అనిల్, రాజు, విజయకుమార్, హను మంతు తదితరులు ఉన్నారు. వీరు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో సిబెళగల్ నుంచి కర్నూలుకు తరలివెళ్లి విష్ణు సమక్షంలో టీడీపీలో చేరారు.



విష్ణు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ 38వవార్డు కార్పొరేటర్ గిప్సన్

సమాజ సేవే ధ్యేయం


నియామక పత్రం అందిస్తున్న వామ్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆదోని టౌన్, ఏప్రిల్ 21: సమాజానికి విద్య, వైద్య, ఆరోగ్య, ఉపాధి లాంటి వివిధ సేవలను అందించడమే ధ్యేయంగా వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఏర్పాటు అయిందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు జక్కా సుబ్బరాజు అన్నారు. ఆదోని సంస్థలో శాఖ ఏర్పాటు సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆదోని శాఖకు ఎంపికైన అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్త, వామ్ మహిళా విభాగం అధ్యక్షురాలు వంకదారు మమతాశ్రీలతో పాటు, ఇతర కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందించారు. సమాజ సేవలను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో దక్షిణాంధ్ర రాష్ట్ర మహిళా విభాగ్ అధ్యక్షురాలు సురా శ్రీదేవి, అధికార ప్రతినిధులు ప్రదీప్, శ్రీరాములు, వెంకటేష్, బద్రి నారాయణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి

మంత్రాలయం, ఏప్రిల్ 21: మండలంలోని మాధవరం చెట్నహళ్లి గ్రామాల మధ్య జాతీయ రహదారిహైవే రోడ్డు పక్కన శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో జింక మృతి చెందింది. రోడ్డు పక్కనే ఉన్న ప్రయాణికులు సంఘటన గురించి మంత్రాలయం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఫారెస్టు అధికారులు మహేంద్రనాయుడు, బీట్ ఆఫీసర్ అనురాధ, శంకర్ నాయక్ జింక మృతదేహాన్ని పశువైద్యాధికారులతో పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు. మగ జింకగా గుర్తించి పొడవు, వెడల్పులు లెక్కించి నమోదు చేసి పంచనామా నిర్వహించారు.

హంద్రీనీవాను పొడిగించాలి

దేవనకొండ,ఏప్రిల్ 21 : మండలంలో 45 వేల ఎకరాలకు సాగునీరిచ్చే హంద్రీనీవా పరిధిని విస్తరించాలని రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి అన్నారు. గుండ్లకొండ ప్రధాన కాలువ వద్ద స్లూయిజ్ ఏర్పాటు చేసి పి.కోటకొండ కాలువ ఏర్పాటు చేసి చెరువులను నింపాలన్నారు. విస్తరిస్తే దాదాపు పదివేలు ఎకరాలకు సాగు, ఆరు గ్రామాలకు పైగా తాగు నీరు కాలువ ద్వారా ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఎన్నికలలో రాజకీయ పార్టీల నాయకులు హంద్రీనీవాపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

● పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 21: పత్తికొండ పట్టణంలో ముస్లిం వీధిలో నివాసం ఉంటున్న షహనాబీ (26) ఆమె కూతురు జాస్మిన్ (9) కొడుకు అలీ అహ్మద్ (7) శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయారని షహనాబీ తండ్రి నూర్ అహ్మద్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సీఐ మురళిమోహన్ వివరాలను వెల్లడించారు. పట్టణంలో ముస్లిం వీధిలో వన్నూరువలి, తన భార్య షహనాబీ, కొడుకు, కూతురుతో నివాసం ఉంటున్నారు. వన్నూరువలి కుటుంబ పోషణ కోసం వేరే ప్రాంతంలో పనికి వెళ్లాడు. షహనాబీ కూతురు, కొడుకుతో కలిసి శనివారం ఉదయం 11 గంటల నుంచి చెప్ప కుండా ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఈ మేరకు షహనాబీ తండ్రి నూర్ అహ్మద్ ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ అయిన ఆ ముగ్గురి ఆచూకి ఎవరికైనా తెలిస్తే పత్తికొండ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, అలాగే 9121101129, 9963346769 నెంబర్లకు తెలియజేయాలని సీఐ మురళి మోహన్ తెలిపారు. నూర్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు బాబు గ్యారంటీ


సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న నాయకులు

వెల్దుర్తి, ఏప్రిల్, 21 : రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారంటీ అని వైసీపీ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని టీడీపీ నాయకులు అన్నారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బింగిదొడ్డి, కసాపురం, మంగంపల్లె, మదార్‌పురం, నరసాపురం, ఎస్.బోయినపల్లె గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరించారు. నాయకులు జయరాముడు, రమాకాంత్‌రెడ్డి, సుధాకర్‌గౌడు, రఘురెడ్డి, మల్లిఖార్జున, ఎర్రబజారు, శ్రీను, యాగంటి, మనోహర్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదులో సమస్యలు పరిష్కరించాలి

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 21: విద్యార్థుల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేసేసమయంలో తలెత్తే సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న కోరారు. ఆదివారం ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులు పరీక్షలకు సంబంధించి మార్కుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఆయితే సాంకేతిక సమస్యల వల్ల ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. కరిక్యులర్ యాక్టివిటీ చేయని కార్యక్రమాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పడం మంచిది కాదని పేర్కొన్నారు. మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘురామయ్య, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్లికార్జున, సంగమేష్, సుదర్శన్ రెడ్డి, పార్థసారథి పాల్గొన్నారు.

నవరత్నాల పేరుతో నవమోసాలు

● సూపర్-6 పథకాలతో విజయ ఢంకా మోగిస్తాం
● మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి


మాట్లాడుతున్న బీవీ

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 21 : జగన్ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగించి నవరత్నాల పేరుతో నవమోసాలకు పాల్పడ్డారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాకముందు విద్యుత్, ఆర్టీసీ బస్సు చార్జీలు, నిత్యవసర సరుకుల ధరలు, ఆస్తిపన్నులు పెంచనని , మద్యపాన నిషేదం చేస్తామని, ప్రతి ఏటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2.38లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అబద్దాల హామీలతో అధికారం చేపట్టారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లకాలంలో ఒక్కహామీ నెరవేర్చకపోగా సామాన్య ప్రజలపై మోయలేని భారాలు మోపి నడ్డివిరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేతలకు ఎన్నో హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, అయినా ఆ వర్గానికి చెందిన వ్యక్తికి సీటు ఇచ్చి ఓట్లు దండుకోవాలని మోసానికి తెగబడ్డారని విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్-6 పథకాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన అందుతోందన్నారు. తల్లికి వందనం, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, రైతు పెట్టుబడి నిధి రూ.20వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగభృతి రూ.3వేలు ఈ చేయూతతో ప్రజలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారని స్పష్టం చేశారు. తనను నియోజకవర్గ ప్రజలు ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీఫారం అందుకున్న బీవీ, రాఘవేంద్ర రెడ్డి


బీవీకి బీఫారం అందజేస్తున్న అధినేత చంద్రబాబు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మిగనూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బీఫారంను అందజేశారు. అమరావతిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయనాగేశ్వరరెడ్డికి ఎమ్మిగనూరు టీడీపీ అభ్యర్థిగా పేర్కొంటూ బీఫారంను అందజేశారు. జయనాగేశ్వరరెడ్డి ఇప్పటికే ఎమ్మిగనూరులో ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు.


అధినేత చంద్రబాబు నుంచి బీఫారం అందుకుంటున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఏప్రిల్ 21: టీడీపీ మంత్రాలయం అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి బీ-ఫాం అందుకున్నారు. ఆదివారం విజయవాడలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా బీ-ఫాం రాఘవేంద్రరెడ్డికి అందజేశారు. దీంతో మంత్రాలయం నియోజకవర్గంలో బీ-ఫాం అందేవరకు చేర్పులు మార్పులు ఉంటాయన్న ఆందోళన ఉండేది. అయితే.. రాఘవేంద్రరెడ్డికి బీ-ఫాం అందజేయడంతో టీడీపీ తమ్ముళ్ల మధ్య జోష్ మొదలైంది.

అంతా మా ఇష్టం

● ఎన్నికల సిబ్బందికి భోజన బాధ్యత అయిన వారికే!
● మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఏర్పాట్లు
● వీరంతా వైసీపీ నియమించినవారే
● అధికార పార్టీకి అనుకూలంగా అధికారుల చర్యలు
● ఇది కచ్చితంగా కోడ్ ఉల్లంఘనే

ఆదోని రూరల్, ఏప్రిల్ 21 : ఎన్నికల కోడ్ అమలులో ఉందని తెలిసి కూడా అధికార పార్టీ వైసీపీ అడుగులకు ప్రభుత్వ అధికారులు మడుగులొత్తడం మానలేదు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించే మిడ్డే మీల్స్ నిర్వాహకులు అధికార పార్టీ వైసీపీకి చెందిన వారని తెలిసి కూడా ఎన్నికల విధులకు వచ్చిన సిబ్బందికి మిడ్డే మీల్స్ నిర్వాహకుల ద్వారా భోజన వడ్డనకు అధికారులు బాధ్యతలు అప్పగించడం గమనార్హం. జిల్లా విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే ఆయా మండలాల ఎంఈఓలు, వారి పరిధిలో ఉన్న ప్రధానోపాధ్యాయులతో, మిడ్డే మీల్స్ నిర్వాహకులతో సమావేశాలు ఏర్పాటు చేశారు.

ఎన్నికల విధులకు వచ్చిన సిబ్బందికి మే 12రాత్రి, 13 ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనాన్ని మిడ్డే మీల్స్ నిర్వాహకులే వంటలు వండి పెట్టాలని, అందుకు ఒక అధికారికి రూ.300 నుంచి రూ.320 చొప్పున ఇస్తామని మండల అధికారులు తెలిపారు. జిల్లాలో మొత్తం 2,204 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కర్నూలు 258, పాణ్యం 357, పత్తికొండ 255, కోడుమూరు 275, ఎమ్మిగనూరు 272, ఆదోని 256, మంత్రాలయం 237, ఆలూరు 294 పోలింగ్ కేంద్రాలుండగా, ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 10 మందికిపైగా ఎన్నికల విధుల్లో ఉండనున్నారు. ఆ విధంగా లెక్కిస్తే దాదాపు 22వేల మందికిపైగానే ఎన్నికల సిబ్బంది విధుల్లో ఉంటారు.

ప్రభుత్వ పాఠశాలల పోలింగ్ కేంద్రాల్లో : ఈ ప్రభుత్వ పాఠశాలలో ఇదివరకు వైసీపీ సానుభూతి పరులే మిడ్డే మీల్స్ నిర్వాహకులుగా ఉంటున్న విషయం తెలిసిందే. వీరికే పోలింగ్ విధులకు వచ్చిన అధికారులకు భోజన వడ్డన బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. "ఇది ఖచ్చితంగా కోడ్ ఉల్లంఘనే. అధికారం చేతిలో ఉందని ఇలా అయినవారికే కట్టబెట్టడం సమంజసం కాదు" అంటూ ప్రజాసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

ప్రైవేట్ పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో : చాలా చోట్ల ప్రైవేట్ పాఠశాలల్లో కూడా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎన్నికల విధులకు వచ్చిన అధికారులకు దగ్గర్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో మిడ్డే మీల్స్ చేస్తున్న నిర్వాహకుల ద్వారా భోజనం వండి పెట్టే ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు.


కోసిగిలో మిడ్డే మీల్స్ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంఈఓ మొహిద్దీన్

డీఈఓ ఆదేశాల మేరకు

డీఈఓ ఆదేశాల మేరకు పోలింగ్ విధులకు వచ్చిన అధికారులకు మిడ్డే మీల్స్ నిర్వాహకులకు భోజన ఏర్పాట్లను అప్పగిస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేశాం. శుక్రవారం కూడా మిడ్డే మీల్స్ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశాం.

- శ్రీనివాసులు, ఎంఈఓ, ఆదోని

వైసీపీ సానుభూతిపరులకు బాధ్యతలు ఎలా అప్పగిస్తారు?

మిడ్డేమీల్స్ నిర్వాహకులు వైసీపీ సానుభూతి పరులన్న విషయం అలందిరికీ తెలుసు. పోలింగ్‌కు వచ్చిన అధికారులకు అలాంటి వారితో వంట వండించి పెట్టడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. ఎలాగైనా వైసీపీ సింపతి పొంది ఎన్నికలకు వచ్చిన అధికారులతో సానుభూతి పొందాలని చూస్తోంది. మిడ్డే మీల్స్ నిర్వాహకుల ద్వారా అధికారులకు భోజనం వడ్డిస్తే ఊరుకునేది లేదు. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం.

- ఉమ్మడి కూటమి నాయకులు

గర్భవతిపై మందు బాబుల దాడి?

● ఆదోని ఆసుపత్రిలో బాధిత నర్సు చికిత్స
● ఇస్వీ పోలీస్ స్టేషన్ ముట్టడి
● రాజీ చేయడానికి వైసీపీ నాయకుల యత్నం

ఆదోని రూరల్, ఏప్రిల్ 21: ఆదోని మండలం పెద్దహరివాణం పీహెచ్‌సీలో స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న గర్భవతి షారూన్ రోజాపై మందుబాబుల దాడికి దిగారు. సదరు నర్సుతోపాటు మరో నర్సు ఆయేషాపై కూడా దాడి చేసినట్లు సమాచారం. పదుల సంఖ్యలో దాడి చేస్తున్న అదే పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ ఇమ్రాన్ తనకేమి పట్టనట్లు ఉండడంపై నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజులాదేవి, శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి కథనం మేరకు వివరాలు... ఈనెల 19వ తేదీన శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ హోళగుంద మండలం హెబ్బటం గ్రామానికి చెందిన శివ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతడిని పెద్దహరివాణం గ్రామానికి చెందిన కృష్ణ, చిన్న గర్జప్ప, గురురాజు(అప్పటికే మద్యం మత్తులో ఉన్నారు)తోపాటు దాదాపు 20మంది దాక గ్రామంలో ఉన్న పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. విధుల్లో ఉన్న ఐదు నెలల గర్భిణి నర్సు షారూన్ రోజాతో పాటు మరో నర్సు ఆయేషా ఉన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శివకు ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తీసుకెళ్లాలని ఆ నర్సులు వారికి తెలియజేశారు. దీంతో ఆగ్రహానికి గురైన మందుబాబులు మహిళా నర్సులపై దాడులకు దిగారు. ఈ దాడిలో నర్సు షారూన్ రోజా కళ్లు తిరిగి పడిపోవడంతో ఆదోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇంత తంతు జరుగుతున్న అక్కడే విధుల్లో ఉన్న డాక్టర్ ఇమ్రాన్ నివారించే ప్రయత్నం చేయలేదని నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజులాదేవి ఆరోపించింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఆయా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న 20 మంది నర్సులు ఇస్వీ పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల వైసీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని రాజీ కుదిర్చేందుకు యత్నించారు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాసులును వివరణ కోరగా... ఈనెల 19న రోడ్డు ప్రమాదంలో గాయపడి పెద్దహరివాణం పీహెచ్‌సీకి వెళ్లిన శివ, కృష్ణ, గురురాజు, చిన్న గర్జప్పతోపాటు మరికొందరు దాడులకు పాల్పడినట్లు నర్సులు ఫిర్యాదు చేశారన్నారు. ఆదివారం అసోసియేషన్ నాయకులు కూడా పోలీస్‌స్టేషన్‌కు వచ్చారరన్నారు. విచారణ చేస్తున్నట్లు తెలిపారు.


పోలీస్ స్టేషన్‌లో బాధితురాలితో యూనియన్ నాయకులు

కమాండ్ కంట్రోల్ రూం తనిఖీ


తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, ఏప్రిల్ 21: ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల నిర్వాహణలో భాగంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఆదివారం సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ అకస్మికంగా తనిఖీ చేశారు. కమాండ్ కంట్రోల్ రూం సంబంధించిన రిజిస్టర్, రికార్డ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణ పై ఏదైనా సందేహాలు ఉంటే కమాండ్ కంట్రోల్ రూం 08512-252339 కాల్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. అందులో భాగంగా ఎన్నికల నిర్వాహణ కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలకు ఎన్నికల కమిషన్ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

● టీడీపీ రాష్ట్ర నాయకులు వైకుంఠం శివప్రసాద్, బుజ్జమ్మ


విలేకరులతో మాట్లాడుతున్న వైకుంఠం శివప్రసాద్, బుజ్జమ్మ

ఆలూరు, ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది, చంద్రబాబు సీఎం కావడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, కపట్రాళ్ల బుజ్జమ్మ అన్నారు. అదివారం ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి కాలం చెల్లిపోయిందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజలు టీడీపీకి పట్టం ఖాయమని స్పష్టం చేశారు. ఆలూరు నియోజకవర్గంలో కూడా టీడీపీ జెండా ఎగరడం తథ్యమన్నారు. సంక్షేమం పేరిట ప్రజలను దగా చేసిన జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. సమావేశంలో అరికేర సర్పంచ్ నాగరాజు, నాయకులు గోవింద్, ప్రకాష్ పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు వేస్తేనే అభివృద్ధి

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్21: తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధికి ఓటు వేసినట్లేనని మండల కమిటీ నాయకులు పార్లపల్లి మల్లికార్జున, దేవిబెట్ట సోమేశ్వరరెడ్డి, కె.టి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దేవిబెట్ట గ్రామంలో టీడీపీ ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకొని తెలుగుదేశం ప్రవేశపెట్టబోయే సూపర్-6 పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ అన్ని వర్గాల ప్రజలను నమ్మించి నయవంచన చేశాడన్నారు. మీ పిల్లల భవిష్యత్తుకు టీడీపీ గ్యారెంటీ ఉంటుందన్న భరోసాను కల్పించారు. జరగబోయే ఎన్నికల్లో టీడీపీ గుర్తుకు ఓటు వేసి బీవీ జయనాగేశ్వరరెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బనవాసి అయ్యాళప్ప, తిమ్మాపురం రంగన్న, సోగనూరు రాఘవేంద్ర, గుడికల్లు దేవదాసు, అయ్యన్న, ఫారం వీరనాగప్ప, చెన్నాపురం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


దేవిబెట్ట గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ మండల కమిటీ నాయకులు

టీడీపీతోనే మహిళలకు న్యాయం

● టీడీపీ తాలుకా మహిళా అధ్యక్షురాలు జానకి చౌదరి ● మద్దికెరలో ఇంటింటి ప్రచారం

మద్దికెర, ఏప్రిల్ 21: తెలుగుదేశం పార్టీతోనే మహిళలకు న్యాయం జరుగుతుందని తాలుకా టీడీపీ మహిళా అధ్యక్షురాలు జానకి చౌదరి అన్నారు. ఆదివారం మద్దికెర గ్రామంలో టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచకాల పాలన కొనసాగించిందని, త్వరలో జరిగే ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తమ ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజును గెలిపించాలని, అప్పుడే పత్తికొండ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాస్టర్ గిడ్డయ్య, సుబ్బులప్ప, చంద్ర తదితరులు ఉన్నారు.


మద్దికెరలో ప్రచారం నిర్వహిస్తున్న తాలుకా టీడీపీ మహిళా అధ్యక్షురాలు జానకి చౌదరి

ముగిసిన ప్రవేశ పరీక్ష

ఆలూరు, ఏప్రిల్ 21: ఆలూరు మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 400 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. 375 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 25 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ రాఘవరావ్ తెలిపారు.

కోసిగిలో పోలీసు కవాతు

కోసిగి, ఏప్రిల్ 21: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కోసిగిలో సీఐ ప్రసాద్, ఎస్ఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కోసిగిలోని ఎస్‌బీఐ నుంచి రంగప్ప గట్టు వరకు డప్పుల శబ్ధంతో కేంద్ర సాయుధ బలగాలు కవాతు ర్యాలీ నిర్వహించాయి.

కాంగ్రెస్ పార్టీకి లక్ష్మీనారాయణరెడ్డి రాజీనామా

ఎమ్మిగనూరు/రూరల్ , ఏప్రిల్21: ఎమ్మిగనూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ జనరల్ సెక్రటరి కె. లక్ష్మీనారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పీసీసీ జనరల్ సెక్రటరీ పదవికి రాజీనామా చేశారు. ఆదివారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్‌గా ఉన్న తనకు తెలియకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడమేగాక కార్యక్రమాలకు ఆహ్వానించలేదన్నారు. అంతేగాక ఇటీవల ఎమ్మిగనూరులో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రచార కార్యక్రమం తనకు తెలియకుండానే ఏర్పాటు చేసి అట్టర్‌ఫ్లాప్ చేసి పార్టీ పరువు తీశారన్నారు. దీంతో మనస్తాపానికి గురై పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవికి తనతో పాటు తన కార్యకర్తలు కూడా రాజీనామా చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం తాను ఏపార్టీలో చేరడంలేదని తటస్థంగా ఉంటానని అన్నారు. మిగతా ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఆహ్వానాలు ఉన్నాయని అయినప్పటికీ న్యూట్రల్‌గానే ఉండదలుచుకున్నామని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ఇన్చార్జిగా వ్యవహరించిన లక్ష్మీనారాయణ ఒక్కసారిగా రాజీనామా చేయడంతో పట్టణంలో చర్చనీయాంశంగా ఉంది.